క్లుప్తంగా

అన్నసత్రం కోసం విరాళం



నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని రామనగర్‌లో ఈ నెల 14 నుంచి 16 వరకు రామాలయంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలలో అన్నసత్రం కోసం స్థానిక నాయకుడు సిలిండర్ లింగం రూ.లక్ష విరాళం అందజేశారు. కేదారీశ్వర ఆశ్రమ కమిటీ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్‌కు ఆలయ కమిటీ సమక్షంలో రూ.లక్ష నగదును అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, పెయింటర్ రాజు, మంద సాయన్న, రమేష్, సీతారాం, కరెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో బడిబాట



పెర్కిట్(ఆర్మూర్): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శనివారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ చైతన్యపరిచారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.రవీందర్, ఉపాధ్యాయులు ఎం.మోహన్, బి. విఠల్, శోభ, భాను ప్రకాష్, లింబాద్రి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): భూమి కలిగిన రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని ఆలూర్ మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఆధార్ వంటి 11 అంకెల ఫార్మర్ ఐడీని కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రైతులు తమ ఆధారు కార్డు, పట్టాపాసు పుస్తకం, ఆధార్ లింకు అయిన మొబైల్ నెంబరుతో సమీప ఏఈవోలను కలవాలని సూచించారు. ఏఈవోలు వసుదాం, రమ్య, రైతులు పాల్గన్నారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవం కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభిస్తామని స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం స్వామి వారికి పల్లకీ సేవ, సోమవారం వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందాంబల కల్యాణోత్సవం, హోమం అనంతరం ఆలయ ప్రాంగాణంలో అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి జయంతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గల లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు వెంకటేష్ తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకరణ, సాయంత్రం హోమం, డోలోత్సవంతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే పూర్ణమి రోజు స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



బాల్కొండ: దొంగతనాల నివారణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని బాల్కొండ ఎస్సై నరేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ కాలనీలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ చేపట్టారు. అనంతరం భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

చిన్నబోతున్న పల్లె ప్రకృతి వనాలు

- ఆహ్లాదం పంచని వనాలు
- ఎండిపోతున్న చెట్లు
- పట్టించుకోని అధికారులు



బోర్డుకే పరిమితమైన నడిమి తండా పల్లె ప్రకృతి వనం.. లోపల ఆరబెట్టిన వరిధాన్యం

బాల్కొండ: పల్లెల్లో ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు చిన్నబోతున్నాయి. పల్లె ప్రకృతి వనాల నిర్వహణ లేకపోవడంతో మొక్కలు, చెట్లు ఎండిపోతున్నాయి. ఎండాకాలంలో ఆకు రాలడంతో వనమంతా ఆకులతో నిండిపోతున్నాయి. అయినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. మెండోరా మండలం నడిమి తండాలో గల పల్లె ప్రకృతి వనం కేవలం బోర్డుకే పరిమితమైంది. వనంలో ఒక్క మొక్కలేదు. ఒక్క నీడనిచ్చె చెట్టు లేదు. బోర్డు మాత్రమే ఉంది. పల్లె ప్రకృతి వనంలో కల్లాలు చేసి వరి ధాన్యం ఆరబెట్టారు. గత ప్రభుత్వ హయాంలో నడిమి తండాను జీపీగా ఏర్పాటు చేశారు. అదే సంవత్సరం పల్లె ప్రగతి పనులు చేపట్టడంతో తండావాసులు ఎంతో ఆనందించారు. కాని తరువాత వాటి సంగతిని అధికారులు, పాలకులు మరిచిపోయారు. ప్రస్తుతం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి కూలీలతో పల్లె ప్రకృతి వనాల్లో ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలిగించొచ్చు. కాని ఆ ప్రయత్నం చేయడం లేదు. కనీసం నీరు పట్టే నాథుడే లేడు. ఉన్నత అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అన్ని చోట్ల అదే పరిస్థితి..

బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రారంభంలో ఉన్న కళ తర్వాత లేకుండా చేశారు. పల్లె ప్రకృతి వనాలను కాపాడటం కోసం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



బోధన్‌లో సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వామపక్ష కార్మిక సంఘాల డివిజన్ ప్రతినిధులు



ఆర్మూర్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు



పోతంగల్‌లో .. సీఐటీయూ నేతలు

బోధన్/ఆర్మూర్‌టౌన్/నవీపేట : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మికుల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తెన్న, రమేష్, వామపక్ష కార్మిక సంఘాల జిల్లా ప్రతినిధులు వేర్వేరుగా పిలుపునిచ్చారు. శనివారం నవీపేటతో పాటు పోతంగల్‌లో, బోధన్ పట్టణ కేంద్రంలో, ఆర్మూర్ పట్టణంలో వారు వాల్ పోస్టర్లను వేర్వేరుగా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. అన్ని రంగాలలోని కార్మికులకు రూ.26 వేల కనీస వేతనాన్ని చెల్లించాలని, 12 గంటల పని వేళలను కుదించాలన్నారు. సీపీఎస్ పెన్షన్‌ను రద్దు చేసి పాత ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయినా కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు.

అస్తవ్యస్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు

- మూల మలుపులపై కనిపించని సూచిక బోర్డులు
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపూర్ శివారులో ఇటీవల ప్రమాదం జరిగిన ప్రాంతం

మాక్లూర్: ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు మూలమలుపులు మృత్యువు రహదారులుగా మారుతున్నాయి. కేవలం ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ నెల 1న గొట్టిముక్కల నుంచి మెట్టు వైపు వెళ్లే మార్గంలో వెంకటాపూర్ రోడ్డు మూల మలుపు వద్ద ఆలూర్ మండలం డీకంపల్లికి చెందిన గౌరి(42)అనే మహిళ చెందింది. ఈ మూల మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఆమెపై దూసుకెళ్లగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇంత జరిగిన ఇప్పటి వరకు అక్కడ ఎలాంటి ప్రమాదకర మలుపు అంటూ సూచిక బోర్డు కూడా పెట్టలేదు. ఎదురుగా వచ్చే వాహనం కనిపించకుండా రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరిగాయి. పెరిగిన చెట్లను తొలగించలేదంటే.. అధికారుల నిర్లక్ష్యం ఎంతో ఇట్టే స్పష్టమవుతుంది. అలాగే జన్నేపల్లి- చిక్లీ మధ్యలో ఉన్న వంతెనపై సగం మరమ్మతులు చేసి మిగితా పనులు చేయకుండా వదిలేసి సంవత్సరం గడుస్తోంది. ఇక్కడ రోడ్డు ప్రమాదం జరుగని రోజు అంటూ ఉండదు. బ్రిలియంట్ పాఠశాల, చిక్లీ మధ్యలో ఉన్న మూల మలుపు వద్ద ఇప్పటికి ఏడుగురు మృతి చెందారు. అయినా సూచిక బోర్డు లేదు. గాలిబ్‌నగర్ నుంచి కల్లెడి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు రెండు చోట్ల అతి భయంకరంగా ఉంది. రెప్పపాటులో రోడ్డు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే వల్లభాపూర్ శివారులో మూడు మూల మలుపులు, చిన్నాపూర్ నుంచి కల్లెడి వెళ్లే రహదారిపై మరికొన్ని ప్రమాదకర మూల మలుపులు ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అస్తవ్యస్థ రోడ్లు, ప్రమాదకర మూల మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా ఆర్‌అండ్‌బీ ఏఈ ఎక్కడ నివారణ చర్యలు చేపట్టడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు.

నిర్లక్ష్యం వల్లే ప్రాణం పోయింది

వెంకటాపూర్ శివారులో ప్రమాదకర మూల మలుపు వద్ద ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదం కేవలం ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే జరిగింది. గౌరి(42) అనే మహిళ తన భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న ప్రమాదకరమైన మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టించి, ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించకుండా ఉన్న చెట్లను తొలగింపజేయాలి.

– మోతే రాజేశ్వర్, గొట్టిముక్కల, మాక్లూర్

ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాలు

బోధన్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఎంఈవోలు.. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ నెల 25 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. శిక్షణలో భాగంగా సంగీతం, నృత్యం, కరాటే, చిత్రలేఖనం, యోగ, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. – సాక్షి నెట్‌వర్క్



బోధన్‌లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య



సాలూర జెడ్పీహెచ్‌ఎస్‌లో .. ఎంఈవో మంజూష



కమ్మర్‌పల్లిలో.. ఎంఈవో ఆంధ్రయ్య



బోధన్‌: శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ అశోక్ కుమార్ రోడే



వేల్పూర్ హైస్కూలులో.. ఎంఈవో రేణుక



బాల్కొండలో.. ఎంఈవో రాజేశ్వర్



రెంజల్ హైస్కూల్‌లో.. ఎంఈవో ఆంజనేయులు



నందిపేటలో .. ఎంఈవో అవదూత గంగాధర్



ఆలూరులో శిబిరానికి హాజరైన విద్యార్థులు, ఎంఈవో నరేందర్, టీచర్లు

పాకిస్తాన్‌పై విజయం సాధించాలని పూజలు



బాల్కొండ మండల కేంద్రంలో అంజన్న గుడిలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

బాల్కొండ: యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించాలని కోరుతూ శనివారం బాల్కొండ మండల కేంద్రంలోని అంజన్న గుడిలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పఠించారు. పార్టీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు తోట చిన్నయ్య, మండల అధ్యక్షుడు నర్సయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్‌లో ..

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, అవసరమైన శక్తిని ఆర్మీ జవాన్లకు ప్రసాదించాలని వేడుకుంటూ శనివారం పోతంగల్ బాలాజీ మందిరంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతంగల్ మండల బీజేపీ అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు మాట్లాడుతూ.. యుద్ధం చేస్తున్న ప్రతి సైనికుడు విజయ దరహసంతో సురక్షితంగా రావాలని భగవంతుడిని ప్రార్థించామన్నారు. నాయకులు సుదాం అశోక్, గంగారాం, సాయిరాం, శంకర్, సాయిలు, కిష్టయ్య, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండల కేంద్రంలో..



ముప్కాల్ మండల కేంద్రంలో హనుమాన్ ఆలయంలో గంటానాథం చేస్తున్న బీజేపీ నేతలు

బాల్కొండ: భారత సైనికులకు సంఘీభావంగా శనివారం ముప్కాల్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో బీజేపీ ఆధ్వర్యంలో గంటానాథం నిర్వహించారు. గంట సమయం పాటు గంట కొడుతూ నినాదాలు చేశారు. భారత సైనికులకు హనుమంతుని అండ ఉండాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ విశాఖనగర్‌లో శనివారం కాలనీవాసులు భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు జాతీయ జెండాలను చేతపట్టుకుని దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డు సైనికుడు భోజారెడ్డి, దయాకర్ రెడ్డి, లిక్కి గంగాధర్, లక్ష్మీ నర్సయ్య, లింబాద్రి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పెర్కిట్ విశాఖ నగర్‌లో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు



పోతంగల్ బాలాజీ మందిరంలో పూజలు

కనీస పింఛన్ సాధనకు పోరాడాలి



మాట్లాడుతున్న టీయూసీఐ నేత మల్లేష్

రుద్రూర్: కార్మికులు జీవించడానికి అవసరమగు వేతనం, రిటైర్మెంట్ తర్వాత కనీస పింఛన్ సాధనకు పోరాడాల్సిన అవసరముందని టీయూసీఐ(ట్రేడ్ యూనియన్స్ సెంటర్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర నాయకుడు బి.మల్లేష్ పిలుపునిచ్చారు. రుద్రూర్ మండలం రాణంపల్లిలో శనివారం భవన నిర్మాణ కార్మికులు ఎర్ర జెండాను ఎగురవేసి మేడే ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని కోరారు. నాయకులు బుజ్జి స్వామి, డి. నాగేశ్వర్, నవీన్, సుమన్, అశోక్, ప్రవీణ్, సాయిబాబా, మీరా, లలిత, గోదావరి, రమాదేవి, అజ్మీర పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారి రాంబాబు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాంలో శనివారం ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సభ నిర్వహించి పథకంలో ఇప్పటి వరకు జరిగిన పనులు, ఖర్చులు, లబ్ధిదారుల వివరాలను తెలియజేశారు. మండల ప్రత్యేక అధికారి రాంబాబు మాట్లాడుతూ.. పనుల్లో సమస్యలు, లోపాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలంలో ఇటీవల దొంగతనానికి గురైన రెండు మొబైల్ ఫోన్‌లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్ చేసి గుర్తించారు. శనివారం బాధితులకు పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఈసందర్భంగా ఎస్సై అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్‌లు చోరీకి గురైనా లేదా పోగొట్టుకున్న వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాక్ చేసి గుర్తించవచ్చన్నారు.

సాటాపూర్ సంతలో..




రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ సంతలో శనివారం పోగోట్టుకున్న సెల్ ఫోన్‌ను పోలీసులు పట్టుకుని బాధితునికి వెంటనే అందించారు. రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. నవీపేట్ మండలం ఫతేనగర్ గ్రామానికి చెందిన హాజీఖాన్ అనే వ్యక్తి సాటాపూర్ సంతలో కూరగాయాలు కొనేందుకు వచ్చాడని పేర్కొన్నారు. మార్కెట్‌లో సెల్ ఫోన్ పోగొట్టుకోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. పోలీసులు వెంటనే ఫోన్ ఆచూకీ కనిపెట్టి బాధితుడికి అప్పగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నవీపేట: మండల కేంద్రానికి చెందిన మైస సాయికుమార్‌కు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైనట్లు కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు భగవాన్, గోపాల్, సంజీవ్‌రెడ్డి, సాయన్నలు శనివారం తెలిపారు. సాయికుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడని పేర్కొన్నారు. లబ్ధిదారుడి తల్లికి చెక్కును అందించినట్లు పేర్కొన్నారు.

రాణంపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



రుద్రూర్: రాణంపల్లిలో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైటర్నరీ సిబ్బంది.. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గాలి కుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలో 190 పశువులకు టీకాలు వేసినట్టు వెటర్నరీ సిబ్బంది తెలిపారు. మండల పశు వైద్యాధికారి సంతోష్ రెడ్డి, వెటర్నరి సిబ్బంది డి.భూమేష్, గంగారాం, సాయి తదితరులు పాల్గొన్నారు.